సాక్షి
అనకాపల్లి

శనివారం । 15 । జూలై । 2023

జయహో భారత్!

అంతరిక్ష పరిశోధనలో భారత పతాకం రెపరెపలాడింది. ప్రతిష్టాత్మక చంద్రయాన్-3 మిషన్ విజయవంతంగా ప్రారంభమైంది. శుక్రవారం మధ్యాహ్నం టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని చూసిన వారి ఒళ్లు పులకించింది. పిల్లలు, పెద్దలు ఆనందంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. కొరువాడ హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.కమలాకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు ఇస్రో అక్షర విన్యాసం చేశారు. అనకాపల్లిలో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు జయహో చంద్రయాన్, జై భారత్, జైహింద్ నినాదాలతో సందడి చేశారు. ఇది భారతీయులందరూ గర్వించదగ్గ విషయమని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి ఒక ప్రకటనలో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

-కె.కోటపాడు/తుమ్మపాల



అక్షర రూపంలో కొరువాడ విద్యార్థుల విన్యాసం

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం
● వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
8లో

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం


మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పోలీసు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి మత్తుపదార్థాల నివారణ కమిటీ సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కలెక్టరేట్‌లో జరిగిన మరో సమావేశంలో జిల్లా రోడ్డు సురక్ష కమిటీతో సమీక్షించారు. రహదారి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అచ్యుతాపురం రహదారిలో భారీ రవాణా వాహనాలు ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా రెడ్ నేపియర్‌తో అధిక పాల దిగుబడి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్


అనకాపల్లి టౌన్: ఆస్ట్రేలియా రెడ్ నేపియర్ పశుగ్రాస రకంతో పశువుల్లో అధిక పాల దిగుబడి వస్తుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి.ప్రసాద్ అన్నారు. ఆ శాఖ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వివిధ రకాల పశుగ్రాసాలు, సాగు వివరాలను క్లుప్తంగా వివరించారు. 100 మంది పాడి రైతులకు ఆస్ట్రేలియా రెడ్ నేపియర్ రకం పశుగ్రాస కణుపులను అందించారు. కార్యక్రమంలో విశాఖ డివిజన్ ఉప సంచాలకులు ఎస్.కరుణాకరరావు, స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు బి.సౌజన్య, సహాయ సంచాలకులు పి.అనుపమ, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుకు ప్రోత్సాహం


రైతులతో మాట్లాడుతున్న డీపీఎం లచ్చన్న

మాకవరపాలెం: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ప్రకృతి సాగు విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం) లచ్చన్న తెలిపారు. నారాయణరాజుపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఖరీఫ్‌లో ప్రకృతి సాగు చేసే రైతులతో మాట్లాడారు. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులతోపాటు ఆరోగ్య వంతమైన పంటను పొందవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగుపై అవగాహన కల్పించారు. నవరత్నసాగు–నేలతల్లి బాగు కార్యక్రమంలో 30 రకాల విత్తనాలతో ఎరువుగా వేసిన మొక్కలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ప్రకృతి సాగు సిబ్బంది సుదర్శన్, కవిత, సూరిబాబు, మంగ పాల్గొన్నారు.

ఒడిశాకు పయనమైన దాసుడు
తరలివచ్చిన భక్తులు



తన పరివారంతో సింహగిరి నుంచి తిరుగుపయనమవుతున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం : సింహగిరిపై మూడు నెలలు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సేవలో తరించిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ శుక్రవారం తమ స్వగ్రామం ఒడిశా రాష్ట్రంలోని బరంపురం సమీపంలోని పట్టుపురంకి తిరుగు పయనమయ్యారు. సింహగిరిపై ఉన్న దాసుడి సత్రం నుంచి మధ్యాహ్నం తమ పరివారంతో స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. అంతరాలయంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. తమ స్వగ్రామంలో ఏర్పాటు చేసిన స్వామివారి ఆలయంలోని హుండీల ద్వారా వచ్చిన నగదుని సింహగిరిపై ఉన్న హుండీల్లో వేశారు. పూజలనంతరం ఆలయంనుంచి బయలుదేరి కొండదిగువ దేవస్థానం పరిపాలనా కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి తిరుగుపయన మయ్యారు.

రంగురాళ్లు మిలమిల

నిత్యం ఏదో ఒకచోట తవ్వకాలు.. ఏడాదికి మూడు నుంచి నాలుగు వరకు బయటపడుతున్న కొత్త క్వారీలు.. ఎన్ని బేస్ క్యాంప్‌లు ఉన్నా ఆగని రంగురాళ్ల అన్వేషణ.. ఒకటా రెండా ఏకంగా 12 క్వారీలు.. కరక, ఆరిల్లోవ రిజర్వు ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులకు తలనొప్పులు.. ఇదీ గొలుగొండ మండలంలో నెలకొన్న పరిస్థితి. జిరాయితీ భూముల్లో క్వారీలు బయటపడటం పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తవ్వకందార్లకు పూర్తి అనుకూలం. విలువైన రకానికి చెందిన రంగురాళ్లు లభిస్తే కాసుల వర్షమే.

- కొత్త క్వారీలు.. జోరుగా తవ్వకాలు
- కలిసొస్తున్న వాతావరణం
- తవ్వకందార్లకు కాసుల 'వర్షం'


కరక క్వారీలో బయటపడిన విలువైన ఎలెక్స్ రకం రంగురాళ్లు (ఫైల్)


ఇటీవల సాలికమల్లవరంలో తవ్వకాలు జరిగిన ప్రాంతం


కరక రిజర్వ్ ఫారెస్ట్‌లో నెలకొల్పిన బేస్ క్యాంప్


పప్పుశెట్టిపాలెం వద్ద క్వారీ ప్రాంతాన్ని కాంక్రీట్ వేసి కప్పిన దృశ్యం

గొలుగొండ: వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు రంగురాళ్ల తవ్వకందార్లకు అనుకూలంగా ఉన్నాయి. వానలు పడితే భూమి తడిచి తవ్వడం సులభమవుతుంది. అందుకే వర్షాకాలంలో ఎక్కువగా తవ్వకాలు జరుగుతాయి. కరక రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ప్రస్తుతం కొంతమంది తవ్వకందార్లు కొత్త క్వారీల అన్వేషణలో బిజీగా ఉన్నారు. ఈ క్వారీలు కనుక్కోవాలంటే మంచి నైపుణ్యం ఉండాలి. మట్టి రంగు, స్వభావాన్ని బట్టి క్వారీల అన్వేషణ జరుగుతుంది. కరక, ఆరిల్లోవ రిజర్వు ఫారెస్ట్‌లో విలువైన రంగురాళ్ల నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. 2001లో మొదటిసారి దట్టమైన కరక రిజర్వు ఫారెస్ట్‌లో క్వారీ బయటపడింది. అప్పట్లో భారీగా తవ్వకాలు జరిగాయి. తరువాత ఇదే ప్రాంతంలో 6 కొత్త క్వారీలు బయటపడటంతో 2006 వరకు నిరాటంకంగా భారీ ఎత్తున తవ్వకాలు జరిపారు. వందల ఎకరాల అటవీ భూములు నాశనం అయ్యాయి. ఈ క్వారీలో లభించిన విలువైన ఎలెక్స్ రకానికి చెందిన రాళ్లకు లక్షల్లో ధర పలకడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన రంగురాళ్ల వ్యాపారులు నర్సీపట్నంలో మకాం వేశారు. జిల్లా రెవెన్యూ, అటవీశాఖ గట్టి చర్యలు తీసుకొని క్వారీలను మూయించాయి. తరువాత 2014లో పాము క్వారీ బయటపడటంతో బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి కొంతమేర తవ్వకాలు ఆపడం జరిగింది.

నాలుగు నెలల్లో నాలుగు చోట్ల..

రిజర్వు ఫారెస్ట్ చుట్టూ అటవీశాఖ సిబ్బంది ఉన్నా తవ్వకాలు ఆగడం లేదు. గడిచిన నాలుగు నెలల్లో నాలుగు చోట్ల ఈ కార్యక్రమం జరిగింది. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో ప్రధానరోడ్డుకు ఆనుకొని రెండు చోట్ల తవ్వకాలు జరిగాయి. అలాగే ఇటీవల సాలికమల్లవరంలో తవ్వకాలు జరగడంతో బేస్ క్యాంప్ సిబ్బంది, గార్డును సస్పెండ్ చేశారు. పప్పుశెట్టిపాలెం ప్రాంతంలో ఉన్న క్వారీ కాపలా సిబ్బంది, హోంగార్డు తవ్వకాలకు సహకరించడంతో వారిని కూడా విధుల నుంచి తొలగించారు. ఈ నాలుగు చోట్ల సిబ్బందిని అప్రమత్తం చేశారు. మళ్లీ వాతావరణం అనుకూలంగా మారడంతో తవ్వకందార్ల వెదుకులాట మరింత పెరిగింది.

అధికారులకు తలనొప్పి

రంగురాళ్ల తవ్వకం అధికారులకు తలనొప్పిగా మారింది. నిత్యం ఏదో ఒకచోట ఇది జరగడంతో పోలీస్, అటవీ, రెవెన్యూశాఖల వారు పరుగులు తీయాల్సి వస్తోంది. సిబ్బంది కొరత ఉండటంతో సమస్య మరింత పెరుగుతోంది. ఆరిల్లోవ, కరక రిజర్వు ఫారెస్ట్ 450 హెక్టార్ల పరిధిలో ఉంటుంది. ఇంత రిజర్వు ఫారెస్ట్‌లో కేవలం 10 మంది సిబ్బంది మాత్రమే గస్తీ కాయడం తవ్వకందార్లకు కలసి వస్తుంది. దీనికితోడు పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం ప్రాంతాల్లో జిరాయితీ భూముల్లో మరో ఐదు క్వారీలు ఉన్నాయి. ఇక్కడ అటవీ సిబ్బంది, పోలీస్ అధికారులు రాత్రి, పగలు కాపలా కాస్తున్నారు. ప్రతి రోజూ నలుగురు పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు.

తవ్వకాలు జరగకుండా చర్యలు



కరక, ఆరిల్లోవ ప్రాంతాల్లో రంగురాళ్ల తవ్వకాలు జరగకుండా ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. సిబ్బంది కొరత వలన ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న అటవీశాఖ సిబ్బంది ఈ సీజన్‌లో ఇక్కడ పనిచేసేలా చర్యలు తీసుకున్నాం. రంగురాళ్ల తవ్వకాలు చేపట్టినా, క్వారీ ప్రాంతాల్లో సంచరించినా కఠిన చర్యలు తీసుకుంటాం. సిబ్బంది కొరత ఉన్నందున ఇబ్బందులు ఉన్నాయి. అటవీ ప్రాంతాల్లో ఎటువంటి తవ్వకాలు జరగకుండా సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నాం,

–రాజారావు,
నర్సీపట్నం డివిజనల్ అటవీ శాఖ అధికారి

ప్రభుత్వం మార్క్ కనిపించేలా అభివృద్ధి పనులు

- దేవరాపల్లిలో సీసీ రోడ్డు పనులు పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి


దేవరాపల్లిలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: కోట్లాది రూపాయలతో తమ ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం ఆనందంగా ఉందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లిలో శారదానది కొబ్బరితోట నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు రూ. 55 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు విస్తరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం మార్క్ స్పష్టంగా కనిపించేలా పనుల్లో పక్కాగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. దేవరాపల్లి పంచాయతీ పరిధిలో జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ. 4.8 కోట్లతో చేపడుతున్న మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. పంచాయతీ పరిధిలో మిగిలిన చోట్ల మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పైపులైన్లు పూర్తి చేసి ఇంటింటికీ కుళాయి నీటిని సరఫరా చేయాలని సూచించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వాలేటి నాగరాజు, ఇంజినీరింగ్ సిబ్బంది సబ్బవరపు సత్యమూర్తి, దీపక్ పాల్గొన్నారు.

ఎడ్‌సెట్‌లో అ'ద్వితీయం'

ఎడ్‌సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఏయూ నిర్వహించిన ఈ పరీక్షలో నాతవరం మండలం లింగంపేటకు చెందిన దత్తసాయి బయాలజీలో, చోడవరం పట్టణ శివారు రేవళ్లుకు చెందిన మనోజ్ఞ త్రిభువని గణితంలో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకులు సాధించారు. దత్తసాయి టీచర్‌గా, మనోజ్ఞ సివిల్స్ సాధనే లక్ష్యంగా సాక్షికి తెలిపారు.


మనోజ్ఞ త్రిభువని


పోలుపర్తి దత్తసాయి

నాతవరం: ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఎడ్‌సెట్ ఫలితాల్లో మండలానికి చెందిన పోలుపర్తి దత్తసాయి జీవశాస్త్రం(బయాలజీ)లో 92 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడు. నాతవరం మండలంలో మారుమూల ప్రాంతమైన లింగంపేట గ్రామానికి చెందిన దత్తసాయి గుంటూరు నాగార్జునసాగర్ ఏపీఆర్‌జేసీలో ఇంటర్, విశాఖలోని వీఎస్ కృష్ణా కళాశాలలోడిగ్రీ చదివాడు. దత్తసాయిది వ్యవసాయ కుటుంబం. ఇటీవల నిర్వహించిన ఎడ్‌సెట్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించడంపట్ల తల్లిదండ్రులు రాము, సుబ్బలక్ష్మి, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడటం తన ఆశగా దత్తసాయి తెలిపాడు.

సివిల్స్ సాధనే లక్ష్యం

చోడవరం రూరల్: 'నా ఆశ, ధ్యాస సివిల్స్‌లో సత్తా చాటడమే. ఎడ్‌సెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు, అక్కయ్య ఇచ్చిన సలహాలు సూచనలు ఎంతగానో ఉపకరించాయి. వారి అండదండలతో తప్పక సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించగలనని నమ్ముతున్నా'.. అంటూ ఏయూ నిర్వహించిన ఎడ్‌సెట్‌లో గణితం మెథడాలజీ విభాగంలో 95 మార్కులతో రాష్ట్రంలో రెండో ర్యాంక్ సాధించిన ఓరుగంటి మనోజ్ఞ త్రిభువని తన సంతోషాన్ని వెల్లడించింది. మనోజ్ఞ తండ్రి ఓరుగంటి సీతబాబు మండలంలోని లక్కవరం హైస్కూల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంగా, తల్లి పద్మజ జుత్తాడ హైస్కూల్లో గణితం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరు చోడవరం పట్టణ శివారు రేవళ్ల గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కుమార్తెకు ఫిజిక్స్ మెథడాలజీలో 216వ ర్యాంకు వచ్చింది. సివిల్స్ కోసం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్న మనోజ్ఞ తన ఆనందాన్ని ఫోన్‌లో సాక్షితో పంచుకుంది.

పీజీ సెట్‌లో మెరిశారు

- ఎంఈడీలో రామకృష్ణకు మొదటి ర్యాంక్
- కంప్యూటర్ సైన్స్‌లో అనిల్‌కు రెండో ర్యాంక్


రామకృష్ణకు స్వీట్ తినిపిస్తున్న అన్నావదిన

నక్కపల్లి: ఆంధ్రాయూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పీజీసెట్ ఫలితాల్లో జిల్లా అభ్యర్థులు ప్రతిభ కనబరిచారు. ఏయూ శుక్రవారం విడుదలచేసిన పీజీ సెట్(ఎడ్యుకేషన్) ప్రవేశ పరీక్షలో నక్కపల్లి మండలం దోసలపాడుకు చెందిన బవిరి శెట్టి రామకృష్ణకు మొదటి ర్యాంకు లభించింది. రామకృష్ణది నిరుపేద కుటుంబం. తండ్రి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ ఏడేళ్ల క్రితం పాముకాటుకు గురై మరణించాడు. తల్లికూడా చిన్నతనంలోనే చనిపోయింది. సోదరుడే తల్లితండ్రీ అయి చదివించాడు. విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే గడిచింది. ఏయూ నుంచి బీఈడీ పూర్తి చేశాడు. తాజా ఫలితాల్లో ఎంఈడీలో 100కు 84 మార్కులతో మొదటి ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు అభినందించారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడి ఉత్తమ విద్యాబోధన అందించాలన్నది తన ఆకాంక్షగా తెలిపాడు.

కంప్యూటర్ సైన్స్‌లో 2వ ర్యాంక్


అనిల్ కుమార్

కె.కోటపాడు : ఏపీపీజీసెట్‌లో మండలంలోని చౌడువాడకు చెందిన భీశెట్టి అనిల్ కుమార్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండో ర్యాంక్ సాధించాడు. తండ్రి రామకోటి గ్రామంలో వెల్డర్‌గా పని చేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. అనిల్ ఇంటి వద్దనే ఉంటూ పీజీ సెట్‌కు ప్రిపేర్ అయ్యాడు. ఏయూలో ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ పూర్తి చేసి, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడటమే తన లక్ష్యమని తెలిపాడు.

సేవ చేసే వారిని ప్రోత్సహించాలి

- మంత్రి మేరుగు నాగార్జున


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

సబ్బవరం: పాశ్చాత్య దేశాల నుంచి స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు వస్తున్న వారిని కేంద్ర ప్రభుత్వం ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ద్వారా ప్రోత్సహించడానికి బదులు అడ్డుకోవడం తగదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. వెదుళ్లనరవలోని వెల్ఫేర్ సొసైటీ అఫ్ ఫెయిత్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో ఉద్యోగాలను త్యాగం చేసి అనాథ పిల్లలకు సేవ చేసేందుకు వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ చిల్డ్రన్ ఆఫ్ ఫెయిత్ డైరెక్టర్ తండు ఆనంద్ కుమార్, రోజీలు విద్యా సంస్థలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇటువంటి సేవలు అందిస్తున్న సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. బావితరాలకు బంగారు భవిష్యత్ అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. విద్య, వైద్యంతోపాటు అనేక రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రిని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దామా సుబ్బారావు, వార్డు ఇన్‌చార్జి మహాలక్ష్మి నాయుడు, దళిత క్రైస్తవ సంస్థల నిర్వాహకులు యలమంచిలి ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, నాయకులు బొట్టా ముత్యాలు, పి.పెంటారావు, బీపీ స్వామి, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే లక్ష్యంగా..


రాజవొమ్మంగి చేరుకున్న సిద్ధార్థ

రాజవొమ్మంగి: ప్రజల్లో చైతన్యం నింపడమే లక్ష్యంతో తెలంగాణలోని గద్వాల్ జిల్లాకు చెందిన యువకుడు సిద్ధార్థ సైకిల్‌పై చేపట్టిన చైతన్య యాత్ర శుక్రవారం ఇక్కడికి చేరుకుంది. గతేడాది ఆగస్టు 29న ఢిల్లీలో ప్రారంభించిన యాత్ర ఇప్పటివరకు 12వేల కిలోమీటర్ల మేర సాగిందని ఇందుకుగాను రూ.2లక్షలు ఖర్చయిందని తెలిపాడు. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, గర్ల్ చైల్డ్ ప్రొటెక్షన్, బాలికా స్వేచ్ఛ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య వంతులను చేస్తున్నట్టు తెలిపాడు. పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, లఢాక్, జమ్ము కాశ్మీరు, ఉత్తరాఖండ్, యూపీ, బీహార్, సిక్కిం, నార్త్ ఈస్ట్ స్టేట్స్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా మీదుగా సౌత్ ఇండియా మొత్తం తిరిగినట్టు చెప్పారు. కేరళ, కర్ణాటక, ఏపీ పూర్తి చేసిన తరువాత తెలంగాణకు చేరతానన్నాడు. నేటి సమాజంలో పక్క గ్రామం వెళ్లాలన్నా మోటారుబైక్‌లు, కార్లు వాడుతున్నారు.. అది మానుకుని సైకిల్ అలవాటు చేసుకోవాలని ప్రజలకు చెబుతూ దీనివల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరిస్తున్నట్టు సిద్ధార్థ తెలిపాడు.

మృతదేహాలు తారుమారు

- ఎన్టీఆర్ వైద్యాలయం సిబ్బంది నిర్లక్ష్యం

అనకాపల్లి టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ వైద్యాలయంలో సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలైంది. యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం తోటాడ గ్రామానికి పొలిశెట్టి శ్రీను (55) మృతదేహానికి బదులు వేరొక గుర్తు తెలియని మృతదేహాన్ని శ్రీను కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాలు... అసకపల్లి వద్ద ఇటీవల లభించిన గుర్తు తెలియని మృతదేహాన్ని సబ్బవరం పోలీసులు అనకాపల్లి వైద్యాలయానికి అప్పగించారు. ఆ మృతదేహాన్ని గుర్తించేందుకు పోలీసులు శుక్రవారం మార్చురీకి వెళ్లి అడగడంతో వైద్యాలయం సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మునగపాక మండలం తోటాడ గ్రామానికి చెందిన పొలిశెట్టి శ్రీను మృతదేహానికి బదులు.. అసకపల్లి వద్ద దొరికిన గుర్తు తెలియని మృతదేహాన్ని అప్పగించామని సిబ్బంది గుర్తించారు. శ్రీను కుటుంబసభ్యులు ఆ మృతదేహాన్ని గురువారమే ఖననం చేశారు. దానిని వెలికితీసేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, పోలీసులు, రెవెన్యూ అధికారులు పరుగులు తీశారు. బయటకు తీసిన మృతదేహాన్ని తిరిగి మార్చురీకి తరలించారు. ఈ విషయమై వైద్యాలయం సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా సిబ్బంది నిర్లక్ష్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్రీను మృతదేహం ప్రస్తుతం ఎన్టీఆర్ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంది.

విద్యాధికులైన మహిళలతో సమాజాభివృద్ధి


సైకిళ్లను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎంపీపీ సూరిబాబు, రమేష్

అనకాపల్లిటౌన్: సమాజాభివృద్ధికి విద్యాధికులైన మహిళలు ఎంతగానో తోడ్పడతారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక జీవీఎంసీ హైస్కూల్‌లో అరబిందో ఫార్మా యాజమాన్యం సిద్ధం చేసిన 2,500 సైకిళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా విధానంలో పలు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. సీఎంను ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులకు సైకిళ్లు అందించాలనే ఆలోచన వచ్చిందన్నారు. తన మాటను గౌరవించి అరబిందో ఫార్మా ప్రతినిధులు సైకిళ్లకు అయ్యే ఖర్చును భరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో విశాఖ పాత్ర ప్రశంసనీయం

- మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు



మద్దిలపాలెం : స్వచ్ఛభారత్‌లో విశాఖ యువత ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌లో ప్రస్తావించడం గర్వకారణంగా ఉందని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఈస్ట్‌పాయింట్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ దుగ్గిరాల రాజకిషోర్ రచించిన ప్లాస్టిక్ గుప్పిట్లో భూగోళం గ్రంథాన్ని కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ఆవిష్కరించారు. విశాఖ తీరంలో సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ను ఇటీవల యువత ఎంతో సాహసోపేతంగా వెలికి తీయడం గొప్ప విషయమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విశాఖలో నిషేధించడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ గుప్పిట్లో భూగోళం గ్రంథాన్ని ప్రొఫెసర్ దుగ్గిరాల రాజకిషోర్ అద్భుతంగా విశ్లేషణతో రచించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి బాలమోహన్‌దాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో పలువు ప్రొఫెసర్లతోపాటు, ఈస్ట్ పాయింట్ కాలనీ మిత్ర బృందం బంగారురాజు, కల్పన, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు



నిందితుడితో సీఐ రుద్రశేఖర్,ఎస్‌ఐ సంతోష్

అరకులోయ టౌన్‌: పరారీలో ఉన్న గంజాయి నిందితుడిని అరెస్టు చేసినట్టు అరకులోయ సీఐ సీహెచ్‌. రుద్రశేఖర్‌ తెలిపారు. 2021లో 150 కిలోల గంజాయి తరలింపులో సహకరించిన అరకులోయకు చెందిన ముతెం రవి(30) అప్పటి నుంచి పరారీలో ఉన్నాడని చెప్పారు. అతనిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. విలేకరుల సమవేశంలో ఎస్‌ఐ సంతోష్‌ పాల్గొన్నారు.

వెంకటనగరం బీచ్‌లో 'భీమా' షూటింగ్‌



సముద్ర తీరంలో షూటింగ్‌ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట: మండలంలోని వెంకటనగరం సముద్ర తీరంలో భీమా సినిమా షూటింగ్‌ సందడి నెలకొంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌ పతాకంపై ప్రొడ్యూసర్‌ కె.కె.రాధామోహన్‌ నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరో గోపీచంద్‌పై డైరెక్టర్‌ ఎ.హర్ష పలు సన్నివేశాలు చిత్రీకరించారు. కథానాయకగా మాళవిక శర్మ నటిస్తోంది. ఈ సినిమాలో గోపీచంద్‌ పోలీసు పాత్రలో నటిస్తున్నాడని ప్రొడక్షన్‌ మేనేజర్‌ బాబీ తెలిపారు. ఇటీవల రంపచోడవరంలో పది రోజులపాటు షూటింగ్‌ పూర్తి చేసుకుని ఇక్కడ ఐదు రోజుల పాటు రాత్రిళ్లు ఫైటింగ్‌ సీన్లు చిత్రీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సి.ఐ. పి.అప్పలరాజు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- డ్వాక్రా మహిళల రుణమాఫీ హామీ నెరవేర్చిన సీఎం జగన్‌
- 45 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు చేయూతతో ఆర్థిక సాయం
- వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌ వైవీ సుబ్బారెడ్డి



సంఘ సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

డాబాగార్డెన్స్‌(విశాఖ): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. జీవీఎంసీ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో స్వయం సహాయక సంఘ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, స్వయం సహాయక సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్‌ స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పాదయాత్రలో మహిళల కష్టాలు స్వయంగా చూసి ప్రతి మహిళను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో డ్వాక్రా రుణాల మాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ హామీ నెరవేర్చారని కొనియాడారు. నవరత్నాలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, శతశాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. మహానేత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలని సంకల్పిస్తే... ఆయన తనయుడు వ్యాపారవేత్తలను చేస్తున్నారని పేర్కొన్నారు. 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు చేయూత ద్వారా ఐదేళ్లలో రూ.75 వేలు ఇచ్చి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు మెప్మా ఆధ్వర్యంలో జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌ ద్వారా ఈ - మార్కెట్‌ ప్రవేశపెట్టి దేశంలో ఎక్కడైనా మనం తయారు చేసే వస్తువులు విక్రయించుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఎంత చేసినప్పటికీ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని ఎప్పటికీ ప్రజలు విశ్వసించరని, మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. నగర మేయర్‌ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ పేదరికం అనే చీకటిని తొలగించి, ప్రతి మహిళను ఆర్థికంగా పైకి తీసుకురావడమే జగనన్న లక్ష్యమని, ఇప్పటికి మూడు దఫాలుగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి, ఆ గ్రూపులను బలోపేతం చేశారన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, మెప్మా మేనేజింగ్‌ డైరెక్టర్‌ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌ కట్టుమూరి సతీష్‌, జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్‌ పాపునాయుడు, జీవీఎంసీ వైఎస్సార్‌ సీపీ ఫ్లోర్‌ లీడర్‌ బాణాల శ్రీనివాసరావు మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల ఆర్థిక లబ్ధిపై మాట్లాడారు.

వడ్డాదిలో రెండు లేన్ల రోడ్డు

- డైవర్షన్‌ రోడ్డు ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్‌ కరణం ధర్మశ్రీ



డైవర్షన్‌ రోడ్డు ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్‌ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్‌) ఆర్‌అండ్‌బీ రోడ్డులో విజయరామరాజుపేట నుంచి వడ్డాది హైస్కూల్‌ వరకు రెండు లేన్లుగా విస్తరిస్తానని ప్రభుత్వ విప్‌ కరణం ధర్మశ్రీ తెలిపారు. వడ్డాదిలో పెద్దేరు వంతెనపై రూ.1.10 కోట్లతో నిర్మించిన డైవర్షన్‌ రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇటీవల పెద్దేరు నదిపై వంతెన కూలిపోవడంతో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడకూడదని తాత్కాలికంగా డైవర్షన్‌ రోడ్డుకు రూ.1.10 కోట్లు, కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. సీఎం కార్యాలయం నుంచి ఫైల్‌ వెళ్లిందని, ఆర్థిక శాఖ ఆమోదించి నిధులు మంజూరైన వెంటనే శిథిలమైన బ్రిడ్జిని తొలగించి కొత్తది నిర్మిస్తామన్నారు. వడ్డాది జంక్షన్‌లో ఇప్పటికే నీటి ముంపు సమస్య లేకుండా చేశామని రూ. 80 లక్షలతో డ్రైనేజీలు, రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. విజయరామరాజుపేట తాచేరు వంతెన నుంచి వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డును రెండు లేన్లుగా మార్చి డివైడర్‌ మధ్యలో విద్యుత్‌ లైటింగ్‌ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే రూ.82 లక్షలతో అంచనాలు తయారు చేసి పంపించామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. వడ్డాది జంక్షన్‌లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ కాలువలు దాటి రోడ్డు మీదకు వచ్చి వ్యాపారాలు చేయొద్దన్నారు. డ్రైనేజీ కాలువపై పలకలు వేసుకోలేని చిరు వ్యాపారుల కొట్లు ముందు అవసరమైతే ప్రత్యేక నిధులతో వాటిని వేయిస్తామని హామీ ఇచ్చారు. వడ్డాది కస్బా రోడ్డు గాని, కేజీబీవీ, జూనియర్‌ కాలేజీ బిల్డింగ్‌, జగనన్న మూడు లే అవుట్లలో 270 మందికి ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరు, వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 860 ఇళ్లు, 900 వరకు పింఛన్లు, 560పైగా రేషన్‌ కార్డులు వడ్డాదిలో తదితర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలన్నీ తానే చేపట్టానని గుర్తు చేశారు. వైస్‌ ఎంపీపీ దొండా లలితానారాయణ మూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్‌ కోవెల జనార్దనరావు, కోఆపరేటివ్‌ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, మాజీ వైస్‌ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, సర్పంచ్‌ కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ నాయకులు పాలిమేర కృష్ణ, వీర్ల సురేష్‌, దాడి పెద గోవింద, తలారి శంకర్‌, గరికిపాటి బాలాజీ పాల్గొన్నారు.

ఇద్దరు 'హౌసింగ్‌' ఉద్యోగులపై కేసు

మునగపాక: లబ్ధిదారుల ఇంటి సామగ్రి లావాదేవీల్లో తేడాలున్నట్టు హౌసింగ్‌ డీఈ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఇద్దరు ఉద్యోగులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మహమ్మద్‌ అలీ షరీఫ్‌ తెలిపారు. కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాలతో ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. విచారణలో రూ.19,63,970 మేర అవినీతి చోటు చేసుకున్నట్టు నిర్ధారణ అయిందన్నారు. ఇందుకు కారకులైన కంప్యూటర్‌ ఆపరేటర్‌ అర్జున్‌,వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ అవినాష్‌లపై చర్యలు తీసుకోవాలని డీఈ ఫిర్యాదు చేశారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాబ్‌ మేళాలో 284 మంది ఎంపిక



ఎంపికైన వారికి ఆర్డర్‌ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్‌.రాయవరం: చదువుకున్న యువతీ యువకులు ఏదో ఒక ఉద్యోగంలో చేరి కుటుంబానికి ఆసరాగా నిలవాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం అడ్డురోడ్డు ఎస్‌వీఎస్‌ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చింది. 680 మంది హాజరుకాగా 284 మంది ఎంపికయ్యారు. వీరికి ఆయన ఆర్డర్‌ కాపీలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది యువతీ యువకులు చదువుకుని ఉపాధి అవకాశాలు లేక ఇంటి వద్దే ఉండిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గ్రామాల్లో పర్యటించినప్పుడు ఉద్యోగాల కోసం అడిగేవారని, ఈ నేపథ్యంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. రాష్ట్రంలో 12 కంపెనీల ప్రతినిధులతో నిర్వహించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌ రాము, వైఎస్సార్‌ సీపీ మండలాధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సీనియర్‌ నాయకుడు పోలిశెట్టి పెద ఈశ్వరరావు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ప్రమాద స్థలంలో అచ్చియ్యనాయుడి మృతదేహం

నర్సీపట్నం/యలమంచిలి: జిల్లాలో రెండు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. నర్సీపట్నం మున్సిపాలిటీ కృష్ణాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళానికి చెందిన పి.వెంకటరమణ(56) అనే వ్యక్తి మరణించాడు. అచ్యుతాపురంలోని ప్రైవేట్‌ కంపెనీలో మెకానిక్‌గా పనిచేస్తున్న వెంకటరమణ. శుక్రవారం స్నేహితుడితో కలిసి బైక్‌పై నాతవరం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. బైక్‌, కారు ఢీ కొనడంతో వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించగా అత్యవసర వైద్య సేవలు అందించి మెరుగైన వైద్య సేవలకు విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేష్‌ తెలిపారు. యలమంచిలి మండలం మల్లవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యలమంచిలి పట్టణం ధర్మవరానికి చెందిన దండా వెంకట అచ్చియ్యనాయుడు (50) మృతి చెందినట్టు యలమంచిలి రూరల్‌ ఎస్‌ఐ కె.సన్నిబాబు తెలిపారు. అచ్చియ్యనాయుడు తుని నుంచి స్కూటీపై ధర్మవరానికి శుక్రవారం సాయంత్రం వస్తుండగా లైనుకొత్తూరు శివారు మల్లవరం వద్ద వాహనం అదుపు తప్పడంతో కిందపడిన ఆయన తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్‌

అనకాపల్లి టౌన్‌: కరాటే క్రీడ స్వీయ రక్షణకు దోహదపడుతుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్‌ పరిశీలకుడు దాడి రత్నాకర్‌ అన్నారు. స్థానిక వి.వి.రమణ రైతు భారతి ఆడిటోరియంలో నిధిషోకోటిన్‌ స్పోర్ట్స్‌ కరాటే అసోసియేషనల్‌ ఆధ్వర్యంలో 'డీఆర్‌కే' కప్‌ సౌత్‌ ఇండియా ఓపెన్‌ కరాటే చాంపియన్‌ షిప్‌ పోటీలను శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం బాలురుతో సమానంగా బాలికలు అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారన్నారు. బాలికలకు కరాటే వంటి క్రీడలను నేర్పించడం ద్వారా ఏ ప్రాంతానికైనా విద్య, ఉద్యోగావకాశాల కోసం ధైర్యంగా పంపించవచ్చన్నారు. ఈ పోటీలు నిర్వహించడంతో దేశం మొత్తం అనకాపల్లికి కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయన్నారు. అంతకుముందు కరాటే అసోసియేషన్‌ సభ్యులను అభినందించారు. సౌత్‌ ఇండియా చీఫ్‌ పాట్నర్‌ పీఎస్‌ఎండీ నాయుడు, 80వ వార్డు కార్పొరేటర్‌ కొణతాల నీలిమ, భాస్కర్‌ దంపతులు, ఒలింపిక్‌ వెయిట్‌ లిఫ్టర్‌ ఎం.వి.మాణిక్యాలరావు, గవర కార్పొరేషన్‌ డైరెక్టర్‌ శిలపరశెట్టి బాబీ, గౌరీ పీఏసీఎస్‌ చైర్మన్‌ కాండ్రేగుల కృష్ణ అప్పారావు, మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ యల్లపు చంద్రమోహన్‌, జిల్లా విజిలెన్స్‌ అండ్‌ మోనటరింగ్‌ సభ్యుడు రేబాక మధుబాబు పాల్గొన్నారు.

20 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి



మాట్లాడుతున్న స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రమామణి

- స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రమామణి

కె.కోటపాడు: జిల్లాలో వచ్చే నెల 15వ తేదీలోగా 20 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ రమామణి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కె.కోటపాడు, దేవరాపల్లి హౌసింగ్‌ సిబ్బంది, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్లతోపాటు సొంత స్థలం ఉన్న వారి ఇంటి నిర్మాణానికి సంబంధించి 58 వేల మందికి అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే 13 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలని సూచించారు. ఇప్పటి వరకూ ఇళ్ల నిర్మాణ ప్రగతిని బట్టి లబ్ధిదారుల బ్యాంక్‌ ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. కార్యక్రమంలో డీఈఈ ప్రసాద్‌, మాడుగుల డీఈ శ్యామ్యూల్‌రాజ్‌, కె.కోటపాడు హౌసింగ్‌ ఏఈ బి.రవిబాబు, తేజ, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు రామారావు, ప్రసాద్‌ పాల్గొన్నారు.

ప్రైవేటు డిగ్రీ కాలేజీల ఫీజులపై పునరాలోచించాలి

- ఏపీ ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల రమణాజీ

చోడవరం: ప్రైవేటు డిగ్రీ కాలేజీల ఫీజుల నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఏపీ ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల రమణాజీ కోరారు. చోడవరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ఫీజ్‌ రెగ్యులేటరీ కమిటీ (ఏఎఫ్‌ఆర్సీ), మోటరీ కమిటీ విడుదల చేసిన జీవో నంబరు. 22 ప్రకారం డిగ్రీ కాలేజీలకు రూ. 12 వేలు, రూ. 15 వేలు మాత్రమే ఫీజులు నిర్ణయించారన్నారు. ఈ ఫీజులు కాలేజీల నిర్వహణకు ఏమాత్రం సరిపోవని వాపోయారు. దీనిపై ప్రభుత్వానికి తమ ఆవేదన తెలియజేయాలనే కాలేజీలకు ఒక రోజు బంద్‌కు రాష్ట్ర వ్యాప్తంగా పిలుపు ఇచ్చామన్నారు. ఈ బంద్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 1100 ప్రైవేటు కాలేజీలు పాల్గొన్నాయన్నారు. జీవోపై పునరాలోచన చేయకపోతే ఏపీ హెచ్‌ఆర్‌ఎం ముందు ఈనెల 18న భారీ ధర్నా చేస్తామన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

కశింకోట: మండలంలోని మోసయ్యపేట శివారు గోకివానిపాలెం గ్రామంలో రామాలయం వద్ద గ్రామ కంఠం స్థలంలో గోకివాడ వెంకునాయుడు ఆధ్వర్యంలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. ఎన్నిసార్లు నచ్చజెప్పినా నిర్మాణం తొలగింపునకు ఆక్రమణదారుడు ససేమిరా అనడంతో గ్రామ వార్డు సభ్యులు, పెద్దలు, గ్రామ సభ నిర్ణయం మేరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఉప సర్పంచ్‌ గోకివాడ గోవింద్‌ తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారుల అనుమతితో ఆ నిర్మాణాన్ని పొక్లెయిన్‌తో తొలగించారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు కల్పించారు.

గ్యాస్‌ ఏజెన్సీపై విచారణ



కైలాసపట్నంలో వినియోగదారులను విచారిస్తున్న సేల్స్‌ ఆఫీసర్‌ ఉమాదేవి

కోటవురట్ల: శ్రీరాజగోపాల ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడ్డారంటూ ఫిర్యాదు అందడంతో ఐవోసీ ఏరియా సేల్స్‌ ఆఫీసర్‌ ఉమాదేవి శుక్రవారం విచారణ జరిపారు. గ్యాస్‌ ఏజెన్సీ కార్యాలయం, గొడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ ఆమెను కలిసి అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు. మాండేటరీ చెకప్‌ పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.150 చొప్పున వసూలు చేశారని, ఇలా మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో సుమారు 12 వేల మంది వినియోగదారుల నుంచి వసూలు చేశారని చెప్పారు. వినియోగదారులను విచారణ చేయాలని డిమాండ్‌ చేయడంతో సేల్స్‌ ఆఫీసర్‌ ఉమాదేవి కైలాసపట్నంలో వినియోగదారులను కలిసి విచారణ జరిపారు. ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ నుంచి వచ్చిన నలుగురు వ్యక్తులు గ్యాస్‌ స్టవ్‌, పైప్‌, ఇతర సేఫ్టీ అంశాలు తనిఖీ చేయకుండా రూ.150 చొప్పున వసూలు వారు తెలిపారు. గత నాలుగేళ్లుగా గ్యాస్‌ సిలిండర్‌ డోర్‌ డెలివరీ చేసినప్పుడు కంపెనీ ధర కంటే అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని సేల్స్‌ ఆఫీసర్‌ తెలిపారు. మాండేటరీ చెకప్‌ చేయకుండా వసూలు చేసిన నగదును రికవరీ చేసి అందరికీ అందజేస్తామని చెప్పారు.

















రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని రాష్ట్ర వాణిజ్య, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీ, మిరియాల కాలనీల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్ హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలు తెలుసుకుని, వాటి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎంసీ కాలనీలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కింద జీ+2 కేటగిరీలో 192 మందికి ఇళ్లను నిర్మించి ఇచ్చారని, ప్రస్తుతం ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కుళాయిలు లేకపోవడంతో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామన్నారు. దీనిపై మంత్రి అక్కడే ఉన్న అధికారులను పిలిచి వివరాలు తెలుసుకున్నారు. కాలనీలో నివసిస్తున్న వారి వద్ద ఒరిజనల్ ఇళ్ల పట్టాలు లేకపోవడంతో చర్యలు తీసుకోలేకపోతున్నామన్నారు. గృహాలు మంజూరు సమయంలో ఇచ్చిన జాబితా మేరకు ఓటీఎస్ అమలు చేయాలని సూచించారు. మహారాష్ట్రకు చెందిన 40 మంది 20 ఏళ్లుగా ఇక్కడే నివాసముంటున్నామని, తమని బొందిలి కులంలో చేర్చమని విన్నవించుకున్నారు.

జగనన్న సురక్షలో చేర్చి అవసరమైన ధ్రువపత్రాలు అందించాల్సిందిగా తహసీల్దార్ గంగాధర రావును ఆదేశించారు. దివ్యాంగుల పింఛన్లు, సదరం సర్టిఫికెట్లు మంజూరుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విజయరామరాజుపేట కమ్యూనిటీ హాలును ఆస్పత్రికి, సచివాలయానికి వాడుతున్నారని, ప్రస్తుతం ఉన్న భవనంపై కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అనుమతి కావాలని అధికారులు వివరించగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

కార్యక్రమంలో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో త్వరితగతిన ధ్రువపత్రాలు



కొత్తపల్లిలో ధ్రువపత్రాలు అందిస్తున్న మండల ప్రత్యేక అధికారి రోజారాణి

కశింకోట: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి రోజారాణి తెలిపారు. మండలంలోని కొత్తపల్లి సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 404 మందికి కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల ధ్రువ పత్రాలు, బియ్యం కార్డులు తదితర ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ముందుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తమ పరిధిలో లబ్ధిదారులను గుర్తించిన మేరకు అవసరమైన ధ్రువపత్రాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

బయ్యవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి 454 మందికి ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా రాని ధ్రువపత్రాలను జగనన్న సురక్షలో అందిస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు, ఏవో ఎ.ఎ.ఖాన్, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, గొల్లవిల్లి జయ, కోన నాయుడు, శామ్యూల్, వైఎస్సార్ సీపీ నాయకుడు అద్దెపల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులు



పూసర్ల వీధిలో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణం

కశింకోట: కశింకోటలోని పూసర్ల వీధి రామాలయం నుంచి కోళ్ల సంత వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం చేపట్టారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.12 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు మొదలెట్టారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పనులను పరిశీలించారు.

క్వారీ లారీల కట్టడికి వినతి



క్వారీ లారీల కట్టడిపై ట్రాఫిక్ సీఐకు వినతి పత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తుమ్మపాల: పట్టణంలో రద్దీ వేళల్లో క్వారీ లారీల రాకపోకలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావుకు ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ చిన్నియాదవ్, అబ్దుల్ కలాం సేవా సంస్థ చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ వినతి పత్రం అందించారు. పట్టణం మధ్యలో నున్న రోడ్ల మీదుగా క్వారీ లారీలను అతి వేగంగా నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పట్టపగలే క్వారీ లారీలు రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయన్నారు. వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటర్ల జాబితా సవరణలపై అవగాహన



ఓటర్ల జాబితా సవరణలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

తుమ్మపాల: ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటి సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావీయకుండా ఓటర్ల జాబితా సవరణ పక్కాగా చేపట్టాలని బీఎల్‌వోలకు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. పట్టణంలోని గుండాల వద్దనున్న సచివాలయంలో అనకాపల్లి, కశింకోట మండలాల బీఎల్‌వోలకు శుక్రవారం ఓటరు సవరణలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో లోపాలకు ఆస్కారం లేకుండా ఫొటో గుర్తింపుతో కూడిన స్పష్టమైన జాబితాను తయారుచేయాలన్నారు. జాబితాలో సవరణలు, వయసు నిర్ధారణను సెప్టెంబర్ 5వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ 16 నాటికి ముసాయిదా ఎన్నికల జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితా సవరణలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. జనాభా, స్త్రీ, పురుష నిష్పత్తులను బేరీజు వేసుకుంటూ ఓటరు జాబితా పక్కాగా ఉండేలా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో కశింకోట తహసీల్దారు సత్యనారాయణ, ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మట్టి గణపతితో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వినాయక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మన భూమి.. మన ప్రకృతిని కాపాడుకుందాం.. కార్యక్రమం ముగింపు సందర్భంగా స్థానిక నెహ్రూచౌక్‌లో శుక్రవారం మట్టి గణపతిని పూజిద్దామంటూ నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి గణపతి పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. సెప్టెంబర్ 19న జరిగే వినాయక చవితి రోజున మట్టి గణపతిని పూజించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పలకా రవి, కొడుకుల శ్రీకాంత్, వేగి జగన్, పెంటకోట వరప్రసాద్, బొడ్డేడ భాస్కరరావు, రాపేటి తాతారావు, బి.రాము పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలు అమలయ్యేలా చర్యలు



హైకోర్టు జారీ చేసిన ఆర్డర్‌ను ఎమ్మెల్యేకు అందజేస్తున్న ముత్యాలు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు త్వరితగతిన అమలు జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హామీ ఇచ్చారని గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు చెప్పారు. ఈ మేరకు మత్స్యకారుల ఉపాధిపై హైకోర్టు జారీ చేసిన ఆర్డర్ ప్రతులను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, నాయకులు బొంది అచ్చిబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎం.అప్పన్న, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సూరాడ ముత్యాలరావు, బొద్దపు చిన్నారావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

పరవాడ: ఖరీఫ్ సీజన్‌లో వరి పండించే రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయడానికి వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కోన రామారావు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బిందు, తుంపర సేద్యానికి అవసరమైన పరికరాలు రాయితీపై అందజేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి మాట్లాడుతూ వరి నారు మళ్లు వేయడానికి వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. వరి విత్తనాలు తీసుకోలేని రైతులు ఆర్బీకే కేంద్రాల్లో విత్తనాలను పొందవచ్చునన్నారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి మాసవరపు నరసింహమూర్తి, రైతులు అయ్యబాబు, అప్పారావు పాల్గొన్నారు.

తాడి గ్రామం తరలించడానికి చర్యలు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ఫార్మా కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామ తరలింపు కోసం ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. దలాయిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాడి తరలింపుపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామం తరలింపు కోసం సిద్ధం చేసిన స్థలంలో జంగిల్ క్లియరెన్స్ పనులు, సర్వే పూర్తి చేసి ఒక్కో కుటుంబానికి 5 సెంట్ల స్థలం కేటాయిస్తూ లేఅవుట్లను సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. తాడి తరలింపు కోసం అవసరమైన నిధులు కేటాయిస్తూ త్వరలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై సీఎంవో అధికారులతో చర్చించినట్టు తెలిపారు. అనంతరం తాడి గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, తహసీల్దారు పి.కనకారావు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ దలాయి నదియా, మాజీ సర్పంచ్ పితాని నీలకంఠరావు, రమణ, గోవిందరాజు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.











